

కిటకిటలాడిన గణేష్‌గడ్డ



బెల్లంతో అభిషేకం

పటాన్‌చెరు టౌన్: సంకటహర చతుర్థి సందర్భంగా రుద్రారం గణేష్‌గడ్డ ఆలయం బుధవారం కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు సంతోష్‌జోషి, జగదీశ్వర్‌స్వామి, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ మోహన్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు మల్లికార్జున్, ఈశ్వర్లు తెలిపారు. ఆలయంలో నిత్య అన్నదానం సాగుతుందని తెలిపారు.

గరిక పూజ

రాయదుర్గం: సంకటహర చతుర్థిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయి క్షేత్రంలో బుధవారం పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. ప్రత్యేకంగా బెల్లం ముద్దలతో అభిషేకం చేశారు అలాగే గరికతో పూజ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

హఫీజ్‌పేట్/శేరిలింగంపల్లి: ఇంటర్మీడియట్ పరీక్షలు శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మాదాపూర్, చందానగర్, మియాపూర్, శేరిలింగంపల్లి, గచ్చిబౌలి డివిజన్లలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో, శేరిలింగంపల్లిలోని జెడ్పీ హెచ్ఎస్ స్కూల్‌లో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. కాగా సైబరాబాద్ సీపీ అవినాష్‌మహంతి ఆదేశాలపై ప్రతి పరీక్షా కేంద్రం పరిధిలో 144 సెక్షన్ విధించారు.ఈ ఉత్తర్వులు మార్చి 19వ తేదీ వరకు అమలులో ఉంటాయి.



చందానగర్‌లోని పరీక్షా కేంద్రం వద్ద బారులు తీరిన విద్యార్థులు







శేరిలింగంపల్లిలోని జెడ్పీహెచ్ఎస్ పరీక్షా కేంద్రంలో..

పీజేఆర్ స్టేడియం తనిఖీ



క్రీడాకారులతో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ స్నేహ, డీసీ వంశీకృష్ణ

హఫీజ్‌పేట్ : చందానగర్ పీజేఆర్ స్టేడియంను శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్, ఉప కమిషనర్ వంశీకృష్ణలు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో మాట్లాడారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. స్టేడియంలోని క్రీడా మైదానాలలో తిరిగి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ డాక్టర్ కార్తీక్, కాంగ్రెస్ నాయకులు రఘునందన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధి నిజాంపేట రోడ్డులోని గ్రీన్ కోర్టు అపార్టుమెంట్ వద్ద తలెత్తిన డ్రైనేజీ సమస్యను సీవరేజ్ బోర్డు అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ డ్రైనేజీ సమస్య ఏర్పడినా పాత డ్రైనేజీ లైన్లకు కొత్త లైన్లను కలపాలని జలమండలి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు మేనేజర్ ప్రశాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, అపార్టుమెంట్‌వాసులు చంద్రం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్ట పార్కును తీర్చిదిద్దుతాం..



మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అడ్డగుట్టలో పార్కును జీహెచ్ఎంసి, హార్టికల్చర్ అధికారులతో బుధవారం హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కులో చక్కని వాతావరణం కల్పిస్తామన్నారు. పిల్లల కోసం ఆట వస్తువులు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో వర్కు ఇన్‌స్పెక్టర్ మహేదవ్, హార్టికల్చర్ దాసు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదవండి.. లక్ష్యాన్ని సాధించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యార్థులు పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని వెలిమెల ప్రభుత్వ మోడల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్ అన్నారు. బుధవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల ప్రభుత్వ మోడల్ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించారు.

సైన్స్ ఎగ్జిబిషన్



రాయదుర్గంలోని జెడ్పీహెచ్ఎస్‌లో



హఫీజ్‌పేట్ : డివిజన్ పరిధిలోని మైత్రినగర్‌లో గౌతమ్ మోడల్ పాఠశాలలో బుధవారం సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గాంధీ హాజరై తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారి ప్రతిభకు పదును పెట్టడానికి ప్రదర్శన తోడ్పడుతుందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ మంగళారపు లక్ష్మణ్ రావు, డైరెక్టర్ భవాని, ప్రిన్సిపల్ సుబ్బలక్ష్మీ, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

బుర్ర కథతో..

గచ్చిబౌలి: సైన్స్ వల్ల సమాజానికి ఎంత ఉపయోగమో విద్యార్థులు వినూత్న రీతిలో బుర్రకథ ద్వారా వివరించి ఆకట్టుకున్నారు. బుధవారం కొండాపూర్‌లో కృష్ణవేణి స్కూల్‌లో సీవీ రామన్ జయంతి సందర్భంగా సైన్స్ డే నిర్వహించారు.

రాయదుర్గంలో..

రాయదుర్గం: విద్యార్థులకు పాఠశాల స్థాయిలో నిర్వహించే ప్రదర్శనలు భవిష్యత్తులో వారు రాణించడానికి ఉపయోగపడతాయని శేరిలింగంపల్లి మండల విద్యాధికారి వెంకటయ్య పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ అంశాలపై 100 ఎగ్జిబిట్లను ప్రదర్శనలో ఉంచారు.

చలివేంద్రం ప్రారంభం



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఫేజ్ 1లో శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో రాజస్థాని మిత్రమండలి వారు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ బుధవారం ప్రారంభించారు. వేసవి కాలంలో మరిన్ని చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, కాశీనాద్ యాదవ్, చంద్రమోహన్ సాగర్, విద్యాసాగర్, సంపత్, యశ్వంత్, గిరిధారిలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే

హఫీజ్‌పేట్ : చందానగర్ హుడా కాలనీలో చందానగర్ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డేను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గాంధీ హాజరై మాట్లాడుతూ నేడు రెడీమేడ్ దుస్తులతో టైలర్ల జీవితాలు మసకబారాయన్నారు. టైలర్లను ఆదుకుంటామన్నారు. చందానగర్ టైలర్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు త్వరలోనే స్థలంతో పాటు భవన నిర్మాణం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు అన్వర్ షరీఫ్, నరేందర్, షరీఫ్, టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్, నర్సింహులు, రాంబాబు, రాజు, వెంకటేష్, లక్ష్మణ్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనాధారిత బోధనా విధానం అవసరం

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, స్కూల్ ప్రతినిధులు

రాయదుర్గం: దేశంలోనే అత్యధిక సంఖ్యలో సాంకేతిక నిపుణులు ఉన్న నగరాల్లో హైదరాబాద్ ఒకటని ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పరిశోధన ఆధారిత, ప్రగతిశీల బోధనా విధానం చాలా అవసరమన్నారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఏర్పాటు చేసిన సఫారీ కిడ్ ప్రీ స్కూల్, డేకేర్ సెంటర్‌ను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. సఫారీ కిడ్ ఇండియా చైర్మన్ జితేంద్ర కర్సన్ మాట్లాడుతూ.. అత్యంత నాణ్యతతో కూడిన విద్యను అందించడం తమ స్కూల్ ప్రత్యేకత అని అన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ సెంటర్ ఫ్రాంచైజీ భాగస్వామి, టెక్ లీడర్ సాహితీ రెడ్డి పాల్గొన్నారు.

శాంటా మరియా స్కూల్‌కు సౌత్ ఏషియా -2024 అవార్డు



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని శాంటా మరియా ఇంటర్నేషనల్ స్కూల్‌కు అరుదైన గౌరవం లభించింది. ఇటీవల గోవాలో జరిగిన కార్యక్రమంలో కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్, అసెస్‌మెంట్స్ స్కూల్స్ కాంక్లేవ్ సౌత్ ఏషియా 2024 అవార్డు ఇచ్చారని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంటా మరియా ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ రుచిరా ఘోష్, సీఈఓ మహేందర్‌రెడ్డిలు అవార్డును అందుకున్నారని చెప్పారు. స్కూల్ డివిజన్ హెడ్ రినీ రాయ్ మాట్లాడుతూ ఈవెంట్‌లో శాంటా మరియా ఇంటర్నేషనల్ స్కూల్ ప్రత్యేకంగా నిలిచిందన్నారు.

'లెమన్ కట్టర్'కు రూ.12 వేలు నగదు బహుమతి



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

పటాన్‌చెరు టౌన్: ఇంద్రేశం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉజ్జీవన్, జీవన్‌కుమార్‌లు ఎలాంటి ఖర్చు లేకుండా వృధాగా పడి ఉన్న వస్తువులతో తయారు చేసిన 'లెమన్ కట్టర్'కు రూ. 12 వేల నగదు బహుమతి లభించింది. అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారు నిర్వహించిన జాతీయస్థాయి జిజ్ఞాస వైజ్ఞానిక ప్రదర్శనలో 15 రాష్ట్రాల నుండి 64 ప్రాజెక్టులను జూమ్ ద్వారా ప్రదర్శించారు. ఇందులో ఇంద్రేశం పాఠశాల 7,8 వ తరగతి విద్యార్థులు రూపొందించిన 'లెమన్ కట్టర్' ద్వితీయ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

పటేల్ చెరువులో గుర్రపుడెక్క తొలగింపు



చెరువును పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్ : మియాపూర్ డివిజన్ పరిధిలోని కాలనీలలో ఏ సమస్య తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలని మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. బుధవారం మియాపూర్ డివిజన్ పరిధిలోని పటేల్ చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను జీహెచ్ఎంసీ ఎంటమాలజీ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దోమల బెడద ఎక్కువగా ఉన్నందున పటేల్ చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను చేపట్టారన్నారు. కార్యక్రమంలో అధికారులు ఏఈ గణేష్, స్థానిక నాయకులు ఉమకిషన్, విజయ్, సుప్రజా, మల్లేష్, శివ ముదిరాజ్, పాండు, నరేష్ నాయక్, ఉపేందర్‌రెడ్డి, సయ్యద్ యూనూస్, హైమద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఎస్ఐ శివకుమార్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, నెల్లూరు జిల్లా, వడ్డెపాలెంకు చెందిన జ్యోతిబాబు (28) సంవత్సరం క్రితం పటాన్‌చెరు మండలం కర్దనూర్ గ్రామంలో ఉంటూ ,మేస్త్రి పని చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఈనెల 25వ తేదీ పాటి గ్రామానికి బైక్‌పై వెళ్లి చికెన్ తీసుకొని కర్దనూర్‌కు వస్తుండగా కుక్క అడ్డు రావడంతో కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం వెంటనే పటాన్‌చెరు పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు.సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.మృతుడి సోదరుడు నాగేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ



విద్యార్థులకు స్టేషనరీని అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు జగదీశ్వర్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: విద్యార్థులు ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ సూచించారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో బుధవారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై సైన్స్ నమూనాలను తిలకించారు.అనంతరం స్థానిక కాంగ్రెస్ నాయకుడు పట్వారీ శశిధర్ అందజేసి పరీక్ష ప్యాడ్స్, స్టేషనరీని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నల్ల సంజీవరెడ్డి, కృష్ణముదిరాజ్, డివిజన్ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు, దుర్గేష్, రెహమాన్, శివ, నవాజ్, సయ్యద్, రఫీ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని జగద్గిరిగుట్ట సెంటర్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు. 6 గ్యారంటీల స్కీంలో భాగంగా రెండు గ్యారంటీలు 500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం 200 యూనిట్లు కరెంటు ఉచిత పథకాలను అమలు చేసినందుకు కృతజ్ఞతగా పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ నాయకత్వంలో పాలాభిషేకం చేశారు. వివేకానందనగర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ నాగమణి, సీనియర్ నాయకులు బసంతరాజు, దుర్గారాణి, పరశురాములు, రమేష్, దుర్గారావు, వెంకటేష్, నాగుల మల్లేష్, కుమార్ యాదవ్, కిషన్ ఎన్ఎస్‌యుఐ నాయకులు దుర్గా, దుర్గా ప్రసాద్, భూషయ్య, ఆర్. లక్ష్మీ, అంజలి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని బహిరంగ సభకు స్థల పరిశీలన

పటాన్‌చెరు: మార్చి 5న జరగనున్న ప్రధాని మోదీ బహిరంగ సభకు పటాన్‌చెరు శివారు ఎల్లంకి కళాశాల సమీపంలో స్థలంను కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి, జిల్లా అధ్యక్షురాలు గోదావరిలు బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అంజిరెడ్డి, సంగప్ప పాల్గొన్నారు.

'ఐఎస్‌బీ'.. అంకెలు, అక్షరాలు, అభిమానం









ఐఎస్‌బీ గ్రౌండ్





అంకెల్లో నిల్చొని విద్యార్థులు తీసుకున్న చిత్రాలు

రాయదుర్గం: ఉన్నత స్థాయి ఉద్యోగులు, వివిధ వ్యాపార, వాణిజ్య రంగాలలో తమ వంతు బాధ్యత నిర్వహించేవారు, అలాగే విద్యార్థులు ఐఎస్‌బీలో ఉన్నారు. జాతీయ స్థాయిలో అగ్రస్థానం, అంతర్జాతీయ స్థాయిలో బిజినెస్ స్కూల్‌గా హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, పంజాబ్ రాష్ట్రం మొహలిలోని ఇండియన్ స్కూల్ బిజినెస్(ఐఎస్‌బీ) మంచి గుర్తింపు పొందింది. ప్రపంచస్థాయి ర్యాంకింగ్ సాధించినప్పుడు ఐఎస్‌బీ వార్షికోత్సవంలో ఆ అంకె, ఇంగ్లిష్, హిందీ అక్షరాలను తలపించేలా ఐఎస్‌బీ విద్యార్థులు నిలబడడం ఆనవాయితీగా వస్తోంది. తాజాగా ఐఎస్‌బీ 22 ఏళ్ల పూర్తి చేసుకోవడంతో దానికి అనుగుణంగా 22 అంకె కనిపించేలా విద్యార్థులు నిల్చుని ఆ ఫొటోను ఐఎస్‌బీ సామాజిక మాధ్యమాల్లో పెడుతున్నారు. అలా రెండు క్యాంపస్‌లలో తీసిన కొన్ని ఫొటోలు.

అరకొర బస్సులు!

- ఇబ్బందులుపడుతున్న ప్రయాణికులు
- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న వైనం



ప్రైవేట్ వాహనంలో వెళ్తున్న విద్యార్థులు

శంషాబాద్ రూరల్: అరకొరగా నడుస్తున్న ఆర్టీసీ బస్సులతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని వివిధ గ్రామాలకు గతంలో కంటే బస్సుల సంఖ్య చాలావరకు తగ్గిపోవడంతో ప్రజలు గత్యంతరం లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. నిత్యం విద్యార్థులు, ప్రైవేట్ ఉద్యోగులు, రైతులు నగరంతో పాటు శంషాబాద్ పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. అయితే వారికి సరిపడా బస్సులు మాత్రం నడపడం లేదు. రామంతాపూర్, పాల్మాకుల, పెద్ద గోల్కొండ మార్గాల్లో ఉన్న గ్రామాల నుంచి వచ్చే బస్సులు తగ్గిపోయాయి. కరోనా నేపథ్యంలో బస్సులను సగానికి పైగా రద్దు చేశారు. మళ్లీ వాటిని పునరుద్ధరించకపోవడంతో ప్రజలు సొంత, ప్రైవేట్ వాహనాలపై ప్రయాణాలు చేస్తున్నారు.

కాలి నడకే దిక్కు..

బస్సు సౌకర్యం లేక గ్రామాల నుంచి విద్యార్థులు రోజూ కాలినడకన పాఠశాలలకు వెళ్తున్నారు. సరైన వేళల్లో బస్సు సౌకర్యం లేక అలీకోల్‌తండా నుంచి రోజూ 50 మందికి పైగా విద్యార్థులు పెద్దషాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలకు కాలినడకన వెళ్లి వస్తుంటారు. వివిధ గ్రామాల నుంచి నర్కూడ ప్రభుత్వ పాఠశాలకు వచ్చే వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు. స్కూల్ ముగిసిన తర్వాత కూడా బస్సుల కోసం గంటల తరబడి రోడ్డుపై నిరీక్షించాల్సి వస్తుంది. సుల్తాన్‌పల్లి, కవ్వగూడ విద్యార్థులు కూడా కాలి నడకన వెళ్తుంటారు.

బస్సు షెల్టర్లు కరువు..

ఇక ఆయా మార్గాల్లో బస్సు షెల్టర్లు లేవు. ఎండకు, వానకు ప్రయాణికులు తంటాలు పడుతున్నారు. కాచారం, నర్కూడ, రాళ్లగూడ ఇందిరానగర్, పాల్మాకుల, మదన్‌పల్లి, పెద్దషాపూర్, గండిగూడ బస్టాపుల్లో షెల్టర్లు లేక ప్రయాణికులు బస్సుల కోసం చెట్ల నీడన వేచి ఉండాల్సి వస్తుంది. మరోవైపు ఘాంసిమియాగూడ వద్ద బస్సు షెల్టరు ఉన్నా ఉపయోగం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్టీసీ బస్సులను వేయాలని కోరుతున్నారు.